

ముద్దం శెట్టి

మనసు మారింది

శంకరనారాయణ, బరువుగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి రా అరుణా: నీ శ్రేయస్సు కాంక్షించే వాణ్ణి గాబట్టి యింతగా చెబుతున్నాను ఈః వివాహానికి అంగీకరించు. చదువు తక్కువే అయినా, రాజారావు సలక్షణమైన ఉద్యోగం చేసుకుంటున్నాడు స్వంత కొంప వుంది. నాలుగురాళ్లు వెనకేసు కుంటున్నాడు. నీకు ఏలోటూ రాకుండా చూచుకోగల సహృదయుడు" అన్నాడు అరుణ వివాహానికి ఒప్పించే ప్రయత్నంచేస్తూ.

అరుణ మొహం పాలిపోయింది. రాజా రావు చదువు సంధ్యల గురించి ఆమె చూచాయగ వింది థర్డ్‌ఫారమ్ వరకు చదివి మానేసినట్టు ఆమెకి తెలిసింది. అందుకనే ఆతనంటే అంతగా ఆసక్తి కనబరచటంలేదు.

"మావయ్యా, బి. ఏ. చదివిన నేను థర్డుఫారమ్ వరకూ చదివిన వ్యక్తిని పెళ్ళిచేసుకోవడంలో యెంత సుఖం వుంటుందో, మీరే యోచించండి. నాకూ ఏవేవో ఆశయాలుంటాయి. కోరిక లుంటాయి. వాటిని చంపుకుని, జీవితాన్ని దుర్భరం చేసుకోలేను కదా మావయ్యా. నేను మీ కూతుర్నే అయితే మీరు యిట్లాంటి సలహా యిచ్చి వుండే వారు కాదేమో." నీరసంగా, నిస్పృహతో అంది అరుణ. తన నిరాకరణ స్పష్టంగా మావయ్యకి తెలియజేసినా, అయన యింకా తనని ఒప్పించాలని ప్రయత్నిస్తున్న మేనమామతో చివరి జవాబుగా యిలా అనక తప్పిందికాదు అరుణకి.

శంకరనారాయణ నివ్వెరపోయాడు. అరుణ తనని ఆ విధంగా అంత కటువుగా నిందిస్తుందని, యెప్పుడూ ఊహించలేదతను. అరుణ తనకి స్వయానా మేన కోడలే అయినా, తల్లీ దండ్రీ లేని పిల్లని యెంతో ఆదరంతో పెంచాడు. బి ఏ. చదివించాడు. బహుశా అంతవరకూ చదివించడమే తను చేసిన పెద్ద పొరపాటని యిప్పుడనుకున్నాడు కాని, యేంలాభం? చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా, ప్రయోజనం శూన్యం... పొడిగా నవ్వేడు.

"ఎంతమాట అనేశావమ్మా అరుణా, నేను, నిన్నెంత వాత్సల్యంతో, ఆదరాభిమానాలతో పెంచానో నీకు మాత్రం తెలీదా? ఈ పరిస్థితుల్లో నా స్వంత కూతురైతే మాత్రం నేను చెయ్యగలిగిందేమిటిచెప్పు? రోజులు అలా మారిపోయినై అమ్మా. నీ వివాహం నిర్ణయించాలని నేనెన్ని సంబంధాలు చూదానో లెక్కలేదు. కనీసం బి ఏ. చదువుకున్న వరుణ్ణి చూస్తే పదివేల కట్నానికి కిందికి దిగిరావడంలేదు. ఆటువంటి సంబంధం యేదేనా నిశ్చయించాలంటే నాకు ఆర్థిక స్తోమత లేదు. అందుకనే యిప్పుడీ సంబంధం అన్నివిధాలా అనువుగా తోచింది గాబట్టే, నిశ్చయించా లనుకుంటున్నానమ్మా. కేవలం చదువేకాదు ప్రధాన విషయం. బాగా చదువుకున్న నిరుద్యోగిని పెళ్ళిచేసుకుంటే మాత్రం ప్రయోజనం యేవిటి చెప్పు. కుటుంబాన్ని పోషించగలిగే స్తోమత వుండాలిగా అందుకేనమ్మా యీ నా తాపత్రయం అంతాను." అన్నాడు ఆవేదనా భరితంగా.

అరుణకి, మేనమామ వాదన యేదీ నచ్చలేదు.

"అలాగయితే, ఓ కిళ్ళీకొట్టువాడికి కట్టబెట్టండి మావయ్యా. అతడూ నన్ను

పోషించగల స్తోమత వున్నవాడేగా !" అంది విసురుగా.

శంకరనారాయణకి వున్నపాటున కోపం ముంచుకొచ్చింది. అరుణ వితండ వాదం అతనికి హేళనగా అగుపించింది. అందుకే ఆ కోపం—అయితేనేం—యిన్నాళ్ళూ సహనం వహించిన తాను, యిప్పుడు తొందరపడకూడదనుకుని ప్రయత్నంమీద తమాయించుకున్నాడు. బరువుగా ఓ నిట్టూర్పు విడిచాడు.

నీకు పెళ్ళి చేసేస్తే, నా బాధ్యత పూర్తిగా తీరుతుందని ఆశించానమ్మా ! కాని నా ఆశ ఫలించే యోగంలేదు. ఏంచెయ్యను ? అది నా దురదృష్టం ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకో అరుణా. నీకు ఇష్టంలేని పెళ్ళి నేనెప్పుడూ చెయ్యనమ్మా. నేనంత కఠోకుణ్ణి కాను." అని చెప్తూ బయటికి నడిచాడు. ఆ మాటలంటున్నప్పుడు అతని గొంతు బొంగురుపోయింది.

అరుణ నిస్పృహతో మంచంమీద కూలబడింది. మొదలు తెగిన వృక్షంలా, ఏమిటి తన జీవితానికి అర్థం? ముందు ముందు యేంజరగనున్నది? ఈ ప్రశ్నలు ఆమె ముందు వికృతంగా నాట్యం చేశాయి. మావయ్య చెప్పిందాంట్లో అసత్యంలేదు! ఈ రోజుల్లో ఆడపిల్లల పెళ్ళిళ్లు జరగడం యెంతో గడ్డు సమస్యగా తయారయిందో, చూస్తూనే వుంది తను అలాగని తనకంటే బాగా తక్కువ చదువుకున్న వ్యక్తిని యెట్లా పెళ్ళాడుతుంది తను? కాని...కాని ... యింకెన్నాళ్ళు మావయ్యకి బరువుగా వుంటుంది. అయితే, ఇప్పుడేం చెయ్యడం? ఆలోచించింది యెంతో లోతుగా. ఆమెకి ఒక్కటే మార్గం అగుపించింది. తన గురించి మావయ్య ఆలోచనల్ని పెంచుకోకుండా వుండాలంటే, తను యెక్కడికైనా వెళ్ళిపోవాలి కాని, ఎక్కడికి పోతుంది. ఆమెకు స్నేహితురాలు వేదవతి గుర్తుకొచ్చింది. వేదవతి విశాఖపట్నంలో నర్సుగా వుంటోంది. కాని, ఆమె అడ్రస్ తెలీదే...ఆ ఊరు వెళ్ళాక యెట్లాగయినా ఆమె వునికి తెలుసుకోవచ్చు ...అన్న నిర్ణయానికి వచ్చింది అరుణ.

* * *

మరునాడు తెల్లారేసరికి అరుణ ఇంట్లో అగుపించకపోవడంతో, శంకరనారాయణ కంగారు పడ్డాడు. స్వంత కూతురు కాపోయినా, స్వంత మేనకోడలు అందునా, పెంచిన ప్రేమ ఒహటి పట్టిలాగుతూనే వుంది. ఆమె మంచం తలగడ క్రింద వుత్తరం దొరికింది, చదివాడు.

పూజ్యులైన మావయ్యకి,

నమస్కారం,

నేనేం అఘాయిత్యం చేసుకోడానికి బైలుదేరలేదు. నాన్నా, అమ్మా పోయాక మీరే నన్ను చేరదీసి, యింత దాన్ని చేశారు. ఇంకా మీకు నేను యెంత



కాలం బరువుగా వుంటాను, చెప్పండి. నా వివాహ సమస్య యిప్పుడో పెద్ద సమస్య అయింది. కనీసం నాలానే ఓ గ్రాడ్యుయేట్ ని పెళ్ళి చేసుకుంటానుకాని మరీ తక్కువ చదువుకున్నవాణ్ణి పెళ్ళి చేసుకోడానికి నా అంతరాత్మ అంగీకరించడంలేదు. ఈ విషయంలో, మీ మనస్సుకి కష్టం కలిగించినందుకు, నాలో నేను ఎంతగా కుమిలిపోతున్నానో ఆ భగవంతుడికే తెలుసు. మీకు, నా మొహం చూపించడానికే సిగ్గుగావుంది. అందుకనే నేను ఇంటినుంచి వెళ్ళిపోతున్నాను విశాఖపట్నంలో నాస్నేహితురాలుంది అక్కడికే పోతున్నాను. మీరేం కంగారుపడకండి నేనీ సాహసానికి ఒడిగట్టినందుకు, నన్ను క్షమిస్తారనే విశ్వసిస్తున్నాను. అత్తయ్యకి నా నమస్కారాలు పిల్లలకి దీవెనలు.

ఇట్లు—అరుణ"

ఆ వుత్తరం చదువుకుని నిర్విణ్ణుడైన శంకరనారాయణ, దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచాడు "ఎంతపని చేశావమ్మా అరుణ..." అంటూ వాపోయాడు.

శంకరనారాయణ భార్య శాంతమ్మ కంట తడి పెట్టుకుంది.

"ఒంటరిగా వెళ్ళింది. ఎట్లా బ్రతుకగలదో ఈ పాడు ప్రపంచంలో...?" అంది, తోటి స్త్రీ గా సానుభూతి వ్యక్తపరుస్తూ. మొదట్నుంచీ కూడా, అరుణంటే ఆమెకి ఎప్పుడూ ద్వేషంలేదు.

* * *

స్టేషన్లో దిగిన అరుణ, లైట్ల కాంతిలో కొట్టొచ్చినట్టు అగుపిస్తోన్న గడియారం కేసి చూసింది. తొమ్మిది దాటింది ఆ రాత్రిపూట వేదవతికోసం యెక్కడ వెదుకుతుంది. ఈ సమస్యని ముందే ఆలోచించుకోకపోవడం, తన తప్పేననుకుంది. ఇప్పుడేం అనుకున్నా ప్రయోజనం లేదనుకొని ధైర్యాన్ని కూడదీసుకున్నదై, స్త్రీల వెయిటింగు రూంకేసి నడిచింది.

ప్లాట్ ఫారమ్ నియాన్ లైట్ల కాంతిలో

మెరిసిపోతోంది ఆ దృశ్యానికి మరో కప్పుడైతే ఆనందించేదే కాని, అప్పట్లో ఆమెకి ఆనందం రవ్వంతయినా కలుగ లేదు. ఏదో భయం చెప్పలేని ఆరాటం ఆమెని కదలించివేశాయి.

స్త్రీల వెయిటింగ్ రూమ్ ఆయాపేరు నరసమ్మ, మధ్య వయస్కురాలు. వుద్యోగంలో చేరకముందు యెలా వుండేదో గాని, ఇప్పుడు మాత్రం నీటుగా ముస్తాబై తన వయస్సుని మరుగు పెడదామన్న ప్రయత్నం చేస్తున్నట్టనిపించేలా వుంది. ద్వారం దగ్గరే స్టూలుమీద కూచుంది. "ఈ రాత్రికి ఇక్కడే వుంటానమ్మా।" అంది అరుణ, నరసమ్మతో.

నరసమ్మ, అరుణకేసి తదేకంగా చూసింది.

"టిక్కెట్టు వుందికదా?" అంది.

"వుంది..."

"అయితే సరే, లోపలికి వెళ్ళండి"

అరుణ లోపలికి అడుగుపెట్టి, సూట్ కేసు బల్లమీదపెట్టి, కుర్చీలో కూలబడింది, వుస్సురనుకుంటూ. ఆమెకి యెదురుగా, యింకెవరో స్త్రీ నిద్రపోతూ వుంది. ఒక ప్రక్క అరుణకి ఆకలి వేస్తోంది. ఏంచెయ్యాలో తోచలేదు. చేతిలో డబ్బయితే వుందిగాని యెక్కడికి వెళ్ళి తింటుంది? ముక్కూ మొహం తెలీని ఆ పట్నంలో, ఆ రాత్రిపూట బైటికి వెళ్ళడానికే భయమేసింది. అందుకనే, ఆకల్ని భరిస్తూనే, ఓపికపట్టి అలా పూరుకుంది.

పదిన్నర కావస్తోంది. అప్పుడే యేదో బండి వచ్చింది. నిద్రపోతోన్న స్త్రీని ఆయా లేపింది. "మీరెళ్లే బండొచ్చిందమ్మగారూ.. లేవండి." అంటూ.

ఆ స్త్రీ చప్పున లేచి, బాత్ రూమ్‌లోకి వెళ్ళి మొహం కడుక్కొని వచ్చి, సూట్ కేసు పట్టుకొని బైటికొచ్చింది. వెళ్తూ, ఆమె ఆయా చేతిలో చిల్లరడబ్బులు పెట్టినట్టు అరుణ గమనించింది. ఆ వుద్యోగం బాగానే వున్నట్టనిపించిందామెకి ఆ క్షణంలో

వచ్చినబండి వెళ్ళిపోయింది. ప్లాటుఫారమ్ నిశ్శబ్దంగావుంది, సుమారు. అక్కడక్కడా యెవరో ప్రయాణీకులు ప్లాటుఫారమ్ మీదే విశ్రాంతి తీసుకుంటున్నారు కొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు

అరుణకి అలా ఒంటరిగా, మౌనంగా కూర్చోవడం, మరీ యిబ్బందిగా తోచింది. నరసమ్మ దగ్గరికి వెళ్ళింది.

"ఇంత పెద్ద స్టేషన్లో కూడా, వెయిటింగ్ రూమ్‌లు ఖాళీగానే వుంటాయా యేవిటి?" ప్రశ్నించింది నరసమ్మను.

"అబ్బే ఎప్పుడూ ఖాళీగావుండవమ్మా ఒక్కోరోజు వుండడానికి వెయిటింగ్ రూమ్‌కి వచ్చినోళ్ళు, యే సినిమాకో పోతారు. అప్పుడు ఖాళీయేగా మరి। ఆళ్ళు రాత్రి ఒంటిగంట కొచ్చేస్తారు.

ఈ రోజూ అదే జరిగిందమ్మా! మీరేం కంగారుపడకండి. నేనున్నానుగా! ఈ వుద్యోగంలో నాకు పదిహేనేళ్ళ సార్వీసుంది. అన్నట్టు, మీ పేరేమిటమ్మా?" అడిగింది నరసమ్మ.

"అరుణ"

"భోజనం చేశారా! లేక యేమైనా తెచ్చిపెట్టమంటారా?"

ఆ ప్రశ్న ఆయానోటే రావడం, తన అదృష్టమే అనుకుంది. వెదక బోయిన తీగ కాళ్ళకి తగిలినట్టయ్యింది.

"మరేం వొద్దుగాని, ఓ గ్లాసుడు పాలు, ఓ బ్రెడ్డూ తెచ్చిపెడుదూ చాలు." అంటూ సూట్‌కేసు తెరిచి, అందులోంచి తీసిన పర్సునుండి ఓ రూపాయి అందించింది.

"ఇప్పుడే వొస్తానమ్మా," వెళ్ళింది చరచరా నరసమ్మ.

అరుణకి. ఒంటరిగా అక్కడుండటం మరీ భయంగావుంది. అప్పుడప్పుడూ యెవరో మగాళ్ళు అలా వరండాలోంచి పోతూ, ఆమెకేసి అదోలా చూస్తూ వెళ్ళిపోతున్నారు. వారిలో ఇద్దరు ముగ్గురు టిక్కెట్టు కలెక్టర్లు కూడా వున్నట్టు గమనించింది, అరుణ.

అరుణకి, ముచ్చెమటలు పోసినయ్ ఏవిటీ వాతావరణం! ఈ రాత్రి తన కిక్కడ రక్షణ వుంటుందా!...అన్న ప్రశ్నలు ఆమె అంతరంగంలో వుద్భవించాయిగాని!, నరసమ్మ వుంటుందికదా అన్న ధైర్యాన్ని కూడదీసుకొని, పిరికితనాన్ని ఆవలికి నెట్టింది.

కాస్సేపటికి, నరసమ్మ వచ్చేసింది, బ్రెడ్డూ పాలూ తీసుకొని. అరుణ వాటితో కడుపు నింపుకొని, తృప్తిగా ఓనిట్టూర్పు విడిచింది. నరసమ్మ, చిల్లరడబ్బు లివ్వబోయింది.

"నువ్వుంచుకో!" అంది, అరుణ. ఆమెని ఆ విధంగా తృప్తిపర్చడం, అప్పట్లో తనకి చాలా అవసరమేమో ననిపించిందామెకి.

నరసమ్మ ముసి ముసి నవ్వుకుంటూ ఆ పైసాల్ని కొంగున ముడివేసుకుంది.

పదకొండున్నర దాటింది. అప్పుడే ఓ బండి వచ్చి వెళ్ళిపోయింది. ఇంకా పన్నెండు కాలేదు. ఓ యిద్దరు టిక్కెట్టు కలెక్టర్లు, మరోవ్యక్తి (యూనిఫారమ్‌లో లేడుగాబట్టి, యేం వుద్యోగం చేస్తున్నాడో గుర్తుపట్టడం కష్టం) నరసమ్మ దగ్గరికి వచ్చారు. అందులో ఒక వ్యక్తి, అరుణకేసి అదోలా చూశాడు. మిగతా యిద్దరూ ఆమెకేసి చూస్తూనే, యెవరైనా తమని చూస్తున్నారేమోనని, దిక్కులు కూడా చూస్తున్నారు.

"ఏం నరసమ్మా, యివ్వేళ మంచి పిట్ట గూటికి చేరిందే!" అన్నాడొక టిక్కెట్టు కలెక్టరు. ఆ స్వరంలోనూ, మనిషిలోకూడా మోటుతనం వుంది.

నరసమ్మకి అటువంటి మాటలు వినడం పరిపాటేమోమరి—నవ్వేసింది.

''ఈ రాత్రి యిక్కడే వుంటుందట బాబూ!'' అంది, వారి మాటలకి మరే విధమైన విమర్శా లేకుండా.

ఆ మాటలు వింటోన్న అరుణకి గుండె ఝల్లుమంది. నరసమ్మకీ, వాళ్ళకీ యేవో లావాదేవీలుండొచ్చునని, యిట్టే గ్రహించేసింది. ఆమె హృదయం ఆరాటంతో, కంగారుతో విపరీతంగా కొట్టుకుంది. ఇప్పుడేం చెయ్యడం? సినీమాకి వెళ్లినవాళ్లు సగంఆటలోనే తిరిగొచ్చేస్తే యెంతబావుణ్ను?. నరసమ్మని చేతిలో పెట్టుకుని, వాళ్లు తనకేం అపకారం తలపెడతారో ?—ఆమె వూహించలేకపోయింది అప్రయత్నంగా కాళ్లు వొణికినయ్ ఒక ప్రమాదాన్ని యెదుర్కొంటున్నందుకు, తన దురదృష్టాన్ని తిట్టుకుంది· అయినా, యిప్పుడనుకుని, ప్రయోజనం యేవిటి? ఈ రాత్రిపూట యెక్కడికీ వెళ్ళలేదుకదా? తను వుంటున్నది పబ్లిక్ స్టేషనుగాని, అడవి కాదు కదా అన్న మొండిధైర్యాని కూడదీసుకుంది.

నరసమ్మతో యేవిటో మాట్లాడి వాళ్లు వెళ్లిపోయారు. అరుణమాత్రం వస్తోన్న నిద్రని ఆపుకుంటూ అలా కూచుంది. ఆమెకి నిద్రపోవాలనిపించలేదు. మరో అరగంట దాటింది.

''నిద్రపో అమ్మా! మీకేం భయం లేదు,'' అంది, నరసమ్మ.

''నిద్రరావడం లేదులే నరసమ్మా!'' అంది, అరుణ

నరసమ్మ నవ్వింది ఆ నవ్వులోని గూఢార్థాన్ని చదవలేకపోయింది, అరుణ.

మరికొన్ని క్షణాలు గడిచినయ్. ఎక్కడో దూరంగా యింజను కూతలు విన్పిస్తున్నాయ్, తను ప్లాటుఫారమ్ మీదికి వెళ్లి, నలుగురూ వున్నచోట కూర్చుండేనో...? అనుకుంది అరుణ ఆ వూహకి, యింకా స్పష్టమైన రూపం రాలేదు. అంతలోనే మొదట నరసమ్మతో మాట్లాడిన ముగ్గురు వ్యక్తులూ మళ్ళీ వచ్చారు ఈసారి వారి కళ్ళల్లో యెర్రదనం భీకరంగా అగుపించింది· మోటుగా వున్న వ్యక్తి, నరసమ్మ చేతిలో నోట్లు మడత పెట్టడం చూసింది, అరుణ. ఆమెలో లేని ధైర్యం మొండితనాన్ని రేకెత్తించింది. లేచి నిల్చుంది. అన్నింటికీ తెగించినవ్యక్తిలా చెంగు చీర కుచ్చిళ్ళలో దోపి భగవంతుని మనస్సులో తల్చుకుంది.

ఆ ముగ్గురూ లోపలికివచ్చి, తలుపు వెయ్యాలని ప్రయత్నిస్తున్నంతలో, మరో టికెట్ కలెక్టర్ రాఘవరావు గొంతు ఖంగుమని వినిపించింది ఆముగ్గురికీ ''తలుపు వెయ్యకు ముకుందం.'' అదో గర్జనలానే వుంది.

ముకుందం, మిగిలినయిద్దరూ మొదట్లో

నివ్వెరపోయినా, మత్తులో వున్నారు గాబట్టి, పిరికితనాన్ని జయించేశారు.

"ఏవిటోయ్ ఆ అరుపు?" అన్నాడు ముకుందం వాడిగా చూస్తూ.

"అరుపు కాదిది! ఆజ్ఞ! మీ విషయం, కొద్దిసేపట్నుంచీ కనిపెడుతూనే వున్నాను. ఒంటరిగావున్న ఆడదాన్ని వంచించాలనికదూ? ఆ పప్పులేం వుడకవ్...బైటికిరండి..." ధైర్యంగానే అన్నాడు, రాఘవరావు.

ఎప్పుడూ మెతగ్గావుండే రాఘవరావు ఆ క్షణంలో అంత ధైర్యంగా మాట్లాడుతూ వుండటం, ముకుందంకి ఆశ్చర్యమే కలిగించింది.

"చేతకాని దద్దమ్మవు. నువ్వేం చేస్తావ్ పోవోయ్ అట్టే వాగక, నీ దారిన వెళ్ళు. మా ఇష్టం...అనుభవిస్తాం..." అన్నాడు ముకుందం, తలుపు దగ్గరికి వెయ్యబోతూ.

మెరుపులా అక్కడికివచ్చిన అసిస్టెంటు స్టేషను మాష్టారు, వాళ్ళకి అగుపించలేదు.

"అనుభవిస్తావేం...?రా స్కౌండ్రల్. ఇదా, మీరు చేస్తున్న వుద్యోగం? కం అవుట్ వస్ట్.. వూఁ...." అంటూ వురిమాడు ఆయన.

ముకుందం మిగిలిన యిద్దరూ నీరైపోయి, పట్టుబడిన దొంగల్లా వణికిపోతూ, వరండాలోకి వచ్చారు.

"క్షమించండి సార్! మాకు వేరే దురుద్దేశం లేదు. ఆమె దగ్గర టిక్కెట్టు వుందో లేదో అడగడానికి వెళ్తున్నాం." అంటూ, తడబడుతున్న గొంతుతో సాకుచెప్పాడు ముకుందం.

"అలాగేం? తలుపు వేసి టిక్కెట్టు అడుగుతావన్నమాట! అబద్ధమాడినా, అతికినట్టుండాలోయ్...అయినా, వెయిటింగ్ రూమ్‌లో టికెట్టు అడగడం, మీ డ్యూటీ కాదోయ్ వాజమ్మా! మీలాంటి చీడపురుగులు వుండటంవల్ల మనందరికీ చెడ్డపేరు రావొచ్చు. మీ ప్రవర్తన గురించి వింటున్నాం. కాని నమ్మలేదు. ఇవ్వాళ స్వయంగా చూశాను. అసలు, మిమ్మల్ని అనేదేవిఁటి? మీతోపాటు ఈ నరసమ్మకి బుద్ధిచెప్పాలి." అన్నాడు మేష్టారు.

వగలమారి నరసమ్మ, భయపడుతున్నట్టు వణికిపోయింది.

"నాదేం తప్పులేదు బాబుగారూ! నే వొద్దంటున్నా, వీళ్ళు లోపలికి పోతున్నారు...'' అంది.

అంతవరకూ అవాక్కయి అంతా చూస్తోన్న అరుణకి, వొళ్ళు మండిపోయింది. వెళ్ళి అమాంతంగా నరసమ్మ పీక నొక్కెయ్యాలనిపించింది. అయితే, అంత సాహసం తనలో లేదనుకుంది.

"అంతా అబద్ధంసార్! ఈమె, వీళ్ళతో లాలూచీపడి, నన్ను నాశనం చెయ్యదల్చుకుంది ఈ నరసమ్మ. కావాలంటే, ఆమెకి వీళ్ళిచ్చిన డబ్బు ఆమె చేతిలోవుంది చూడండి. ఇటువంటి నీచపు స్త్రీలు ఆయాలుగా వుండటం, మరీ ఘోరం..." అంది వుద్రిక్తతతో.

"అంతా అర్థమయ్యిందమ్మా! నీకీ యిబ్బంది కలిగినందుకు చాలా విచారిస్తున్నాను. వీళ్ళందరి విషయం నేను చూసుకుంటాన్లే...నువ్వు ప్రస్తుతానికి ఫస్టుక్లాసు లేడీస్ వెయిటింగ్ రూమ్‌కి వెళ్ళమ్మా! రాఘవరావ్, నువ్వీమెని తీసుకెళ్ళి ఫస్టుక్లాసు లేడీస్ వెయిటింగ్ రూమ్‌లో అప్పజెప్పు...నేను చెప్పినట్టు అక్కడున్న వరహాలుకి చెప్పు ఆ ముసల్ది మంచిదే!" అన్నాడు మేష్టారు.

"థ్యాంక్యూ సార్..." అంటూ అరుణ సూట్‌కేసు పట్టుకుని రాఘవరావు వెంట వెళ్ళింది.

"గొప్ప వుద్ధారకుడు వచ్చాడండీ! అంతగా ఆమెపట్ల అభిమానం వుంటే, ఆమెని పెళ్ళిచేసుకోరా! ఆ దమ్ము లేదు...'' కసిగా, వుండబట్టలేక రాఘవరావుతో అన్నాడు ముకుందం.

రాఘవరావు యేమీ అనలేదుగాని మేష్టారు వుగ్రుడై పోయాడు.

"షటప్ స్కౌండ్రల్ ... మాట్లాడ్డానికి, యింకా సిగ్గులేకపోతేసరి!..." అంటూ వాళ్లని తనవెంట రమ్మంటూ వెళ్ళిపోయాడు తన ఆఫీసు గదికేసి మేష్టారు.

రాఘవరావు ఫస్టుక్లాసు లేడీస్ వెయిటింగ్ రూమ్‌కేసి అరుణతో నడిచాడు.

నరసమ్మకి కళ్లు తిరిగినట్టయ్యింది. ఆమెపై యేవిధమైన చర్య తీసుకుంటారోనన్న భయం ఆవరించిందామెని. ముకుందం వాళ్లందించిన రూపాయలు, తనకి వుచ్చిత్రాడులా మారుతాయని ఆమె వూహించలేదు పాపం! దిగాలుపడి కూచుండిపోయింది. రేపట్నుంచి సస్పెండు చేస్తారేమోనన్న భీతి, ఆమె మెదడులో ఆలోచనల్ని రేకెత్తించింది. ఇప్పుడు పశ్చాత్తాపపడినా, ప్రయోజనం యేవిటి?

అరుణకి రాఘవరావుని చూస్తుంటే అభిమానం, జాలి కలిగాయి. తన శీలాన్ని కాపాడ్డమే గాకుండా, వాళ్ళచేత నానా మాటలు తిన్నాడు. ఇక ముందు కూడా వాళ్లు ఆయన్ని మాటలతో చిత్రవధ చేస్తారు. పెళ్ళిచేసుకోమని, వాళ్ళు తణ్ణి ఛాలెంజి చెయ్యడం, అరుణ చెవుల్లో యిప్పటికీ గింగురుపెడుతూనే వుంది. ఆయనే గనక సమయానికి అడ్డుపడకపోతే, తన బ్రతుకు యేమయ్యేది! అటువంటి వ్యక్తిని పెళ్ళిచేసుకుంటే, తప్పేముంది! అయితే, ఆయన అంగీకరించాలిగా! ఆయన చేస్తున్న వుద్యోగం ఫరవాలేదు. మరి చదువో...? అక్కడే తను దెబ్బతింటుంది...అయినా ఆ ప్రసక్తి యింక తీసుకురాకూడదని నిశ్చయించుకుంది

"చూడండి...' ఫస్టుక్లాసు లేడీస్ వెయిటింగ్‌రూమ్‌లో తనని అప్పజెప్పి, తిరిగి వెళ్ళిపోతోన్న రాఘవరావుని పిల్చింది, అరుణ.

''చెప్పండి...'' అన్నాడు రాఘవరావు.

"మీ పేరు చెప్పడానికి అభ్యంతరముందా?"

"అబ్బే...! రాఘవరావు..."

"చూడండి రాఘవరావుగారూ! వాళ్ల ప్రయత్నానికి మీరు అడ్డు తగిలారు. వాళ్ళేమైనా మీకు అపకారం తలపెడతారేమో, కాస్త జాగ్రత్తగా వుండండి." చెప్పాలనుకున్న సలహా చెప్పేసింది.

రాఘవరావు ధైర్యంగానే ఓ మందహాసం చేశాడు.

"ఏడిశారు. నాకూ బలగముందండీ! అటువంటి భయమేం లేదు. పిచ్చివేషాలు వేశారంటే, దుమ్ముదులేరించేస్తాను. సరేగాని, మీరు రేపు యెక్కడికి వెడతారు?" అన్నాడు.

"మా స్నేహితురాలు నర్సుగా పని చేస్తుందండీ! అక్కడికి వెళ్ళాలి.''

"అయితే, మీరు ఒంటరిగా వెళ్ళకండి. ఆ వెధవలు, దెబ్బతిన్న పులుల్లా వేచి వుంటారు. రేపు వుదయం వచ్చి, నేను తీసుకెళ్తాలెండి."

ఆశ్చర్యపోయింది, అరుణ.

"మీ కెందుకండీ అంత శ్రమ?" అంది.

"శ్రమకేముంది లెండి...మీరున్న పరిస్థితిలో నేను శ్రమపడినా, కష్టమనిపించదు. వస్తా..." అంటూ వెళ్ళిపోయాడు, రాఘవరావు.

"ఎంత మంచి వ్యక్తి...?" అనుకుంది మనసులో.

వెళ్ళి సోఫాలో కూలబడింది. ఆమె మనో నేత్రాల ముందు, రాఘవరావే మెదుల్తున్నాడు.

* * *

తెల్లవారింది ... ఏడుగంటలకి. రాఘవరావు వచ్చాడు.

"మీరు రెడీయేనా?" అన్నాడు.

"పదండి...ఏదీ ఆ సూట్‌కేసు..."

"అబ్బే! మీరు పట్టుకోవడ మేమిటండీ! ఏమంత బరువుకాదు లెండి... నేను పట్టుకుంటాను."

"ఏం ఫరవాలేదు." అంటూ తన చేతిలోకి తీసుకొన్నాడు సూట్‌కేసుని.

అరుణ, నిజంగా కొత్త పెళ్ళి కూతురులా సిగ్గుపడిపోయింది...

రిక్షాస్టాండు దగ్గరికొచ్చి, ఓ రిక్షాని పిల్చి, అందులో కూర్చోమన్నాడు రాఘవరావు.

"మరి, మీరో...?" అంది అరుణ. రిక్షాలో కూచుంటూ.

"నాకు సైకిలుంది లెండి..." అంటూ కాస్తంత దూరంలో వున్న సైకిల్ని తెచ్చుకుని బైలుదేరాడు.

కొంతదూరం వెళ్ళాక, ఓ డాబా యింటిముందు రిక్షాని ఆపమన్నాడు, రాఘవరావు.

"ఇక్కడి కెందుకండీ?" కాస్తంత కంగారుతో అడిగింది, అరుణ.

రాఘవరావు నవ్వేడు.

"మరేం కంగారుపడకండి. ఇది మా ఇల్లు. మా అమ్మగారు మిమ్మల్ని తీసుకురమన్నారు. టిఫిను, కాఫీ తీసుకుని హాస్పటల్‌కి వెళ్దాం." అన్నాడు

అరుణ, సందేహిస్తూ అతనికేసి కళ్ళు వ్పగించి చూస్తోంది. ఆ కళ్ళల్లో యేదో అనుమానం దోబూచులాడుతోంది. అది గమనించిన రాఘవరావు మళ్ళీ అన్నాడు.

"సందేహిస్తున్నా రెందుకో నాకు అర్థంకాదు. మా అమ్మగారున్నారు... పదండి..." అని, అరుణ దిగింది రిక్షా

రాఘవరావు సూట్‌కేసు తీసుకుని, రిక్షావాడికి డబ్బులిచ్చి పంపాడు.

"రండి..." ఇంట్లోకి నడిచాడు. అరుణ అతణ్ణి అనుసరించింది.

రాఘవరావు తల్లి శాంతమ్మ, వాళ్ళకి



యెదురుగా వచ్చి, అరుణకేసి తదేకంగా చూస్తోంది

"మా అమ్మగారు..." అంటూ అరుణకి పరిచయం చేశాడు, రావఘరావు.

అరుణ సవినయంగా నమస్కరించిందామెకి

శాంతమ్మ మొహంలో ప్రసన్నతతో కూడిన ఓ చిరునవ్వు తళుక్కుమంది.

"మా అబ్బాయి అంతా చెప్పాడమ్మా! కూచో...టిఫినూ,కాఫీ తీసుకుందువుగాని అంటూ వంటగదికేసి వెళ్ళింది. అరుణ కూడా అక్కడుండకుండా, శాంతమ్మను అనుసరించి, అక్కడే కూచుని, టిఫినూ, కాఫీ తీసుకుంది.

శాంతమ్మ, పూర్వకాలపు మనిషయినా, కొద్దిపాటి ఆధునిక భావాలు గలది. అందుకే కొడుకు అరుణని తీసుకొస్తానంటే కాదనలేదు. పైగా ఆమెతో ఆప్యాయంగా మాట్లాడింది.

అరుణ, శాంతమ్మకి కృతజ్ఞత చెప్పుకుని, మళ్ళీ బైలుదేరింది. రాఘవరావు, ఆమెతోపాటువెళ్ళాడు. వేదవతిడ్యూటీలో లేదని తెలిసింది, తీరా హాస్పటల్‌కి వెళ్ళాక ఆమె వుంటున్న ఇల్లు తెలుసుకుని, అక్కడికి వెళ్ళారు.

వేదవతి, అరుణని చూడగానే విస్తుపోతూ, యెంతో ఆదరంగా ఆహ్వానించింది.

"రావే అరుణా! చాలా రోజుల తర్వాత నిన్ను చూశాను. యెంతో సంతోషంగా వుంది. నా ఇల్లు తెలుసుకోవడంలో యిబ్బందేం కలగలేదుకదా" అంది, హుషారుగా.

"లేదే, ఇదిగో-వీరిసహాయంతో సుళువుగా తెలుసుకోగలిగాను. ఈయనేగాని నన్ను ఆదుకోపోతే యేమయ్యేదాన్నో..."

వేదవతి ఆశ్చర్యం యినుమడించింది.

"ఓ! అయితే, యీయన మీ ఆయన

కాదన్న మాట! ఐయామ్ సారీ! మీరిద్దరూ కలిసొస్తే, పెళ్ళయ్యాక యిలా వచ్చారేమో నను కున్నాను." నవ్వుతూ అంది, రాఘవరావు కేసి చూస్తూ.

రాఘవరావు యిరుకునపడి, మొహం దించుకున్నాడు. అసలే అతనికి బిడియం.

అరుణ నవ్వేసింది.

"మంచిదానివేనే!" నవ్వుతూనే అంది, అరుణ.

"ఐయామ్ సో సారీ మిష్టర్..." రాఘవరావుకేసి అదోలా చూస్తూ అంది, అరుణ.

"నా పేరు రాఘవరావండీ! ఇక్కడే టి. సి. గా పనిచేస్తున్నాను," అన్నాడు

"ఐసీ! గ్లాడ్ టు మీట్ యు నా స్నేహితురాలికి సహాయం చేసినందుకు థాంక్స్... రండి లోపలికి."

వేదవతి ఇరువుర్నీ ముందుగదిలో కూచోబెట్టి, కాఫీ తయారుచేసేందుకు వంటగదిలోకి వెళ్ళింది. అరుణ కూడా ఆమెను అనుసరించింది.

రాఘవరావు చుట్టూ కలయజూశాడు. గదినీటుగా వుంది. గదిగోడలనిండా వేదవతి వివిధభంగిమల్లో తీయించుకున్న ఫొటోలు వున్నయ్. నిజంగానే ఆమె అందమైనది. అయితే, అరుణ అతణ్ణి ఆకర్షించినంతగా, వేదవతి ఆకర్షించలేకపోయింది.

కాఫీ తెచ్చి యిచ్చింది వేదవతి. కాఫీ తీసుకున్నాక, వాళ్ళిద్దరికీ చెప్పి బయలుదేరాడు రాఘవరావు. "నా కృతజ్ఞత యెలా తెలియజెయ్యాలమో అర్థంకావడం లేదండీ రాఘవరావుగారూ!" అంది మెల్లగా అరుణ చీరచెంగు చేతి వేలికి సుతారంగా చుట్టుకుంటూ.

"ఆఁ... దానికేముందిలెండి..."

"మళ్ళీ కనిపిస్తారా?"

"వీలు చూసుకొని వస్తాలెండి..." అంటూ రాఘవరావు నిష్క్రమించాడు.

రాఘవరావు వెళ్ళిపోయాక, చిలిపిగా అరుణకేసి చూసింది వేదవతి.

"ఏవిటే, యీ ఊరి టి. సి. తో యింత పరిచయం యేర్పడిందంటే, ఆశ్చర్యమే! మొదట్నుంచీ తెలిసిన వాడా?" అంది.

అరుణ, బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది.

"అదేం కాదులే; రాత్రి బండి దిగాక లేడీస్ వెయిటింగ్ రూమ్‌లో అడుగు పెట్టాను... ఆ తరువాత జరిగిన సంఘటనలో, యీయనే నన్ను కాపాడారు." ఒక్క ముక్కలో చెప్పింది.

"ఏవిటి కథ?" వేదవతి బుగ్గమీద వేలేసుకుని; అదోలాంటి పోజులో అడిగింది.

అరుణ, అంతా వివరంగా చెప్పింది. "అయితే, యీ ఊళ్ళో అడుగుపెడుతూనే ప్రమాదంలో యిరుక్కున్నావన్న మాట!" నవ్వుతూ అంది వేదవతి.

"ఏమైనా నువ్వు అదృష్టవంతురాలివే;

ఈ రాఘవరావు, కాశీమజిలీల్లోని రాజ కుమారుడిలా ఆదుకున్నాడు. లే... స్నానం చేద్దువుగాని...''

స్నానం అయ్యిందిలే..."

"మరి టిఫిను?"

''అదీను..."

"ఎక్కడ...?"

''రాఘవరావుగారే వాళ్ళింటికి తీసు కెళ్ళి టిఫిను, కాఫీ పెట్టించారు...''

''అబ్బో! మరింకేం... వాళ్ళావిడ యేం అనలేదా?"

''ఈయనకింకా మేరేజ్ కాలేదుట... వాళ్ళమ్మగారున్నారు... ఆమె చాలా మంచిది..."

"అయితే, తొలి చూపుల వలపేమిటి చెప్మా-'' విరగబడినవ్వుతూ అంది, వేదవతి.

అరుణ కూడా నవ్వింది-కాస్తంత సిగ్గుతో.

"ఫోవే! నువ్వెప్పుడూ యింతే!" అంది మూతి తిప్పుతూ.

"సరే! పద...వంటచేద్దాం కలిసి.."

అరుణ లేచింది.

* * *

ఆ రాత్రి పదింటికి డ్యూటీకి వెళ్తానని చెప్పింది వేదవతి. సాయంత్రం అలా షికారుకని బీచ్‌కి వెళ్ళారు ఇద్దరూ. అక్కడ వేదవతికి తెలిసినవాళ్లు చాలా మంది కలిశారు. అందరికీ అరుణని పరిచయం చేసింది. వాళ్ళంతా తనకేసి పరిశీలనగా చూడ్డం, అరుణకి యెబ్బెట్టుగా తోచింది. ఎనిమిదికి తిరిగొచ్చి, భోజనాలు చేశారు. కాస్సేపు ఇద్దరూ విశ్రాంతిగా కూర్చొని గతస్మృతుల్ని నెమరువేసుకుంటూ వుంటే, తలుపు తట్టారెవరో. వేదవతి వెళ్ళి తలుపు తీసింది.

ఆ వచ్చినవ్యక్తి పురుషుడే. అతనితో వేదవతి చెప్పిన జవాబు మాత్రం స్పష్టంగా వినిపించింది, అరుణకి.

"మా స్నేహితురాలువచ్చింది. హాస్పటల్లో కలుద్దాం... పదింటికి వెళ్తాను,"

అని మెల్లగా చెప్తూ వచ్చింది వేదవతి.

"ఎవరే...?" అరుణ ప్రశ్న.

"ఓ పిల్ల డాక్టరులే..."

"ఓ!"

ఆ ప్రసక్తిని పొడిగించలేదు అరుణ. పదింటికి సెమీ సూట్‌లో వున్న ఓ యువకుడొచ్చాడు. వేదవతి హడావుడిగా బైలుదేరింది.

"అరుణా వస్తానే! ఎవరొచ్చినా, తలుపుతియ్యకు. నేను లేనని చెప్పేయ్,"

అంటూ చెప్పి, ఆ యువకుడితోపాటు వెళ్ళిపోయింది.

నర్సు దుస్తుల్లో, వేదవతి మరీ అందంగా అగుపించింది అరుణకి. ఆ క్షణంలో, ఆ వృత్తిపట్ల యెక్కడలేని అభిమానం, అభిలాష,పుట్టుకొచ్చిందామెలో. అయితే, యెవరొచ్చి పిల్చినా, తలుపు తియ్యొద్దని ప్రత్యేకంగా వేదవతి యెందుకు చెప్పినట్టు...? ఆమె మెదడులో యేవేవో ప్రశ్నలు, అలల్లా లేచాయి. తలుపు గడియ వేసుకుని పడుకుంది. గతరాత్రి సమంగా నిద్ర లేకపోవడం వల్ల, చప్పున మగత కమ్మేసిందామెకి.

అరుణ మాంచి నిద్రలో వుండగా, తలుపు తట్టిన శబ్దం అయ్యింది. కళ్ళు నులుముకుంటూ, విసుగ్గా లేచింది. ఆమె గుండెలు అప్రయత్నంగా జోరుగా కొట్టుకున్నాయి కాళ్ళు వణక సాగినయ్. టేబిల్ మీదున్న అలారం టైమ్‌పీస్‌వేపు దృష్టి సారించింది. ఒంటిగంట దాటింది.

"ఎవరూ?"

"ఏమిటి వేదం, నా గొంతు గుర్తుపట్టలేదా? తలుపు తెరు..." అన్నదా గంభీరమైన గొంతు.

అరుణ నిర్ఘాంతపోయింది. వేదవతి చెప్పిన మాటలు గుర్తుకొచ్చినయ్ తలుపు తియ్యదల్చుకోలేదు.

"వేదవతి డ్యూటీకి వెళ్ళిందండీ! నేనామె స్నేహితురాల్ని... హాస్పిటల్‌కి

వెళ్ళండి, ఆమె కలుస్తుంది..." గొంతు కాస్త హెచ్చించి మరీ అంది.

"స్నేహితురాలివే కదా; మరింకేం; తలుపు తియ్యి'' అన్నదా గొంతు.

వొళ్ళు మండిపోయింది, అరుణకి.

"షటప్! వొళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడండి... వెళ్ళండిక ... లేకపోతే అరుస్తాను." కోపంగా గర్జించింది.

అతను మళ్లీ యేం మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. అరుణ నడుం వాల్చింది. ఆమెకి ఆ వాతావరణం చాలా అసహ్యంగా తోచింది. తను యేం అనుకుని యింటినించి బైలుదేరింది? ఏం జరుగుతోంది...? చాలా సేపటివరకూ బాధ పడింది

* * *

తెల్లారింది—

ఏడింటికి వేదవతి వచ్చింది. "రాత్రి యెవరైనా వచ్చి పిలిచారా నన్ను?" ప్రశ్నించింది, కాఫీ తీసుకుంటూ.

ఎవ్వరూ రాలేదనే అబద్ధం చెప్పింది.

"నిద్రపట్టిందా?" మళ్లీ వేదవతి ప్రశ్న.

"లేదే! ఒంటరిగా పడుకోవడమంటే నాకు చెడ్డ భయం. మా మామయ్యగారింట్లో మా శోభ నా దగ్గర పడుకునేది. నేనిక్కడ వుండలేను బాబూ..." అంది అరుణ.

"అయితే మరేం చేస్తావ్? ఉద్యోగం కోసం ప్రయత్నిస్తా నన్నావుగా...!"

"ఉద్యోగం దొరకడం మాత్రం అంత సులువా? మళ్ళీ మావయ్య దగ్గరికే పోతాను..."

"అక్కడికి మరి వెళ్ళనని చెప్పావు?"

"తప్పుతుందా మరి? అవివాహిత స్త్రీ ఒంటరిగా జీవించడం, చాలా కష్టం— యెంతో చొరవ వుంటేనే తప్పించి. నాకు మరీ భయమేస్తోంది ఇవ్వాళే వెళ్లిపోతాను."

"పోనీ, ఓ రెండ్రోజులుండి వెళ్ల కూడదూ?" అంది వేదవతి.

నిజానికి వేదవతికి యెంతో ఆనందమనిపించింది, అరుణ వెళ్ళిపోతానంటే. అరుణ, ఆమె స్వేచ్ఛకిఅడ్డంగా వుండేమోనని మరి.

"మళ్లీ యీ సారి వస్తాలేవే; ఇప్పుడు మాత్రం వుండను..."

"ఎప్పుడూ నీ మనస్తత్వాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాను...డబ్బుందా ?''

"వుందిలే..." అంది. వేదవతిని డబ్బడగడం యిష్టంలేకపోయిందామెకి యెందుకో.

ఆ రోజే మధ్యాహ్నం నాలుగింటికి బయలుదేరింది అరుణ.

"స్టేషనుకి రావాలనుకున్నానే అరుణ! కాని, నా ఫ్రెండొకామె వస్తానంది. మరేం అనుకోకు..."అంది, వేదవతి.

"ఫరవాలేదులేవే! నేనేం పల్లెటూరిదాన్నా, వెళ్ళలేకపోవడానికి?" నవ్వేసింది, అరుణ.

రిక్షా ముందుకి సాగింది. రిక్షా వేగంతోపాటు, అరుణ ఆలోచనలు వేగాన్ని అందుకున్నాయి. వేదవతి యెంతగా మారిపోయింది? ఆమెకి అంత వరకూ వేదవతిపట్ల ఉండే గౌరవం నశించింది. నేరుగా రాఘవరావు ఇంటికి వెళ్ళింది. ఆయన దగ్గర కొంత డబ్బు తీసుకోవాలి. అతడు తప్పకుండా ఇస్తా డనే నమ్మకం వుంది. ఆ పరిస్థితుల్లో అంతకంటె మరోమార్గం అగుపించలేదు.

కాఫీ తీసుకుంటున్న రాఘవరావు, సూట్‌కేసు పట్టుకొని ఇంట్లో అడుగు పెట్టిన అరుణని చూసి, విభ్రాంతి చెందాడు.

"రండి... రండి... మళ్లీ ఎక్కడికి బయలుదేరారు ?" అంటూ ముందు కొచ్చాడు.

అరుణ, బరువుగా ఓ నిట్టూర్పు విడి చింది. ఆమె మొహంలో ఉత్సాహం యే కోశానా లేదు.

"నేను, నా స్నేహితురాలితో ఉండి, ఉద్యోగ ప్రయత్నాలు సాగించాలన్న కలల్ని పండించుకొని వచ్చానండీ కాని నా స్నేహితురాలు చాలా మారిపోయింది. అక్కడి వాతావరణం చాలా యెబ్బెట్టుగా ఉంది. మరోక్షణం అక్కడ వుండలే నంతగా, జుగుప్స కలిగింది. ఏం చెయ్య డం? ఎక్కడ్నించి వచ్చానో, మళ్ళీ అక్కడికే వెళ్లిపోతాను. మా మావయ్యకి క్షమాపణ చెప్పుకుని ఆయన నిశ్చయిం చిన సంబంధాన్ని సంతోషంతో అంగీక రిస్తాను. అంతకు మించి నేను చెయ్యగలి గిందేమీ లేదు అయితే, మీరు నాకో చిన్న సహాయం చెయ్యాలి..." ఆమె అలా చెబుతూవుంటే గొంతులో కంపన ధ్వనించింది ఆమె కళ్ళు చెమ్మగిల్లడం, రాఘవరావు గుర్తించాడు.

రాఘవరావు అసలే జాలిగుండెలకు ప్రతినిధి. కరిగిపోయాడు.

"ఏమిటి చెప్పండి...?"

"నాకో పదిరూపాయలివ్వండి. నేను మా ఇల్లు చేరుకున్నాక, పంపుతాను," అంది, మొహం దించుకుని. ఆమె ఎంతగా బాధపడుతుందో, రాఘవరావు అర్థం చేసుకోగలిగాడు.

శాంతమ్మ, లోపలిద్వారం దగ్గర నిలబడి అంతా విన్నది. ఆమెకి సాను భూతి కలిగింది కొడుకు అరుణ గురించి పదేపదే చెబుతూ వుండటం వాడి ఆలో చనలు ఆమె చుట్టూ పరిభ్రమిస్తూ వుండ టం పసిగట్టిన శాంతమ్మ, కొడుకు మన స్తత్వాన్ని అర్థంచేసుకోగలిగింది. ఆమెకి అరుణంటే అభిమానం యేర్ప డింది. అరుణ ప్రవర్తన యెటువంటిదో ఆకళింపు చేసుకుంది. ఆమె ఉత్తమ ఇల్లాలు కాగలదనుకుంది.

వెళ్లిపోడానికి తొందరేమిటమ్మా ? ఇక్కడే వుండకూడదూ?" అంటూ దగ్గ రగా వచ్చింది, శాంతమ్మ.

"వొద్దండీ! మీ ఇంట్లో ఉంటే మరిం కెన్నో అభాండాలు వెయ్యొచ్చి పాడు ప్రపంచం..." అంది, అరుణ.

"చూడమ్మా అరుణా, నా మనసులోని మాట చెబుతాను. నువ్వేమీ అనుకోవు కదా?"

"ఎంతమాటన్నారండీ; మీరు నా శ్రేయోభిలాషులు. మీరుచెప్పింది నేనె ప్పుడూ అపార్థంచేసుకోను."

"మాకూ యింకెవ్వరూ లేరమ్మా. నేను చూస్తే ముసలిదాన్నయిపోయాను. మా అబ్బాయి పెళ్లి గురించి నేను ప్రయ త్నిస్తున్నా. వాడికి నచ్చిన అమ్మాయి దొరకడంలేదు. నువ్వు అంగీకరిస్తే, నా కోడలిగా చేసుకుంటానమ్మా!" అంది, శాంతమ్మ.

అరుణ ఆశ్చర్యంతో ఒక్కసారి నిర్ఘాంతపోయింది. ఏవిటీ అనుకోని సంఘ టన! ఆమెహృదయాంతరాళంలో ఎక్కడో చెప్పలేని ఆనందం పెల్లుబికింది. కళ్లు ఓ వింతకాంతిని సంతరించుకున్నాయి.

"ఏవిటండీ మీరంటున్నది?" అంది వుత్సుకతతో.

"ఔనమ్మా! నీ కిష్టమైతేనే అంగీక రించు..." మళ్ళీ అంది శాంతమ్మ.

మీ సహృదయతనిఎలా హర్షించాలో, నా కృతజ్ఞత ఎలా వ్యక్తీకరించుకోవాలో అర్థంకావడం లేదండీ! నదీప్రవాహంలో కొట్టుకుపోతున్న వ్యక్తికి ఆసరాగా ఏపాటి కర్రైనా దొరికినా, మంచిదేకదా: ఇంతకంటె నాకు కావల్సిందేవిటి? కాని, మీ అబ్బాయిగారికి..." అంటూ రాఘవ రావుకేసి ఓరగా చూసింది, అరుణ.

ఆమె హృదయం వడివడిగా కొట్టు కుంది, అతను యేం జవాబు చెప్తాడో నన్న ఆందోళన అది.

"ఏరా అబ్బాయ్, నువ్వేమంటావ్?" మందహాసంతో అంది, శాంతమ్మ ఆమెకి తెలుసు, కొడుకు నిరాకరించడని.

"నా అదృష్టంగా భావిస్తాను..." అన్నాడు రాఘవరావు, అరుణకేసి అను రాగ దృక్కుల్ని సారిస్తూ.

ప్రపంచంలోకెల్లా తనే గొప్ప అదృష్ట వంతురాలన్నట్లుగా మురిసిపోయింది అరుణ

"ఎంత అదృష్టవంతురాల్నండీ నేను.. ఆ అదృష్టమే నన్నిలా ఇక్కడికి తీసు కొచ్చిందేమో." అంటూ, శాంతమ్మ పాదాలకు సవినయంగా నమస్కరిం చింది.

శాంతమ్మ కళ్ళల్లో ఆనందభాష్పాలు ముత్యాల్లా మెరిసినయ్ తను యెదురు చూసినరోజు వచ్చినందుకే. ఆ ఆనందం! రెండుచేతుల్లో ఆమెని లేవనెత్తి,

"లే అమ్మా మీ మావయ్యకి ఉత్తరం రాయి, వెంటనే రమ్మని..." అంది.

"వద్దండీ! ఇప్పుడు మీరే నాకు సర్వ స్వమూను. నా పెళ్ళయ్యాకనే అక్కడికి వెళ్తాను," అరుణ అంది.

"ఆయన, మరేం అనుకోరా."

"అబ్బే! ఏమీ అనుకోరండీ! నా శ్రేయస్సుని కోరేవ్యక్తి, ఆయనొక్కడే, మా బంధువుల్లో..."

"అయితే సరే! వివాహం, ఆలయంలో దైవసాన్నిధ్యంలో ఏర్పాటు చేస్తాను..." అంది శాంతమ్మ.

అరుణ మురిసిపోయింది ఆమె మొహం అప్పుడే సిగ్గుతో ఎఱ్ఱబారింది.

"పదమ్మా లోపలికి..." అంటూ తీసుకుపోయిందామెని శాంతమ్మ.

రాఘవరావు, ఆనందంతో వుక్కిరి బిక్కిరయ్యాడు.

* * *

మరునటిరోజు ఏకాదశి ఆ రోజే శుభ దినంగా భావించిన శాంతమ్మ, నలుగురు బంధువులూ, పెద్దల సమక్షంలో ఆలయ ప్రాంగణంలో కొడుకు వివాహాన్ని, జరిపించింది. ఆమె మంచితనాన్ని, అధునా తన భావాల్ని, అక్కడ చేరిన వారందరూ అభినందించారు. ఆ వివాహానికి వేదవతికూడా వచ్చింది స్నేహితురాల్ని, తనివితీరా కౌగలించుకుంది.

"నిజంగా నువ్వే అదృష్టవంతురాలివే అరుణా!" అంది ఆమె మాటల్లో అంతులేని ఆవేదన, నిస్పృహ ధ్వనించింది.

ఏమైనా, అరుణమాత్రం తనని వరించిన అదృష్టానికి మురిసిపోయింది. ఆమెకి తెలుసు రాఘవరావు గ్రాడ్యుయేట్ కాదని-కనీసం మెట్రిక్ అయినా పాసు కాలేదని. కాని, ఆ తెలివితక్కువ పట్టుదలని ఓ మూలకి విసిరేసి, ఆ ప్రసక్తిని మరిచిపోయింది. అంతా దైవఘటనగా తోచిందామెకి. రాఘవరావుతో తన వివాహం రాసిపెట్టి ఉంది గాబట్టే, మావయ్య తెచ్చిన సంబంధాన్ని త్రోసిరాజని, యిలా వచ్చేసింది. అదే తన జీవితంలో మలుపు...తన జీవితానికి వెలుగురేఖ! రాఘవరావు తను నచ్చినవాడు... మెచ్చినవాడు. అది చాలు అనుకుంది.

* * *

వారంరోజులు యిట్టే గడిచిపోయాయి. అరుణ వైవాహికజీవితం ప్రశాంతంగా సాగిపోతూ వుంది. మావయ్య దగ్గరికి తామిద్దరూ కలిసి వెళ్ళాలన్న కోరిక ఆమెలో బలీయంగా వుంది. ఓ రోజు అత్తయ్యతో అంది.

"మా మావయ్య గారింటికి ఓ సారి వెళ్లొస్తాం అత్తయ్యగారూ!" అని.

శాంతమ్మ కాదనలేదు.

"అలాగే వెళ్ళండమ్మా!" అంటూ గ్రీన్‌సిగ్నల్ యిచ్చింది.

మరునాడే రాఘవరావు, అరుణ బయిలుదేరారు. స్టేషన్లో ముకుందం వాళ్ళని చూసి, సిగ్గుతో తలవంచుకుని తప్పుకుని వెళ్ళిపోయాడు.

రాఘవరావు, అరుణ నవ్వుకొన్నారు.

* * *

శంకరనారాయణ దంపతులు, అరుణని హఠాత్తుగా చూసి నిర్ఘాంత

పోయారు. ఆమె ప్రక్కనే వున్న రాఘవరావుని చూసి మరీ విస్తుపోయారు.

"మమ్మల్ని దీవించండి మావయ్యా! అత్తయ్యా! నువ్వూను." అంది చిరునవ్వుతో అరుణ, వాళ్ళిద్దరికీ పాదాభివందనం చేస్తూ. రాఘవరావు కూడా ఆమెతోపాటు వాళ్ళకి నమస్కరించాడు.

"కలకాలం సుఖంగా, ఆనందంగా జీవించండి..." అంటూ మనసారా దీవించాడు శంకరనారాయణ.

"నేను చేసింది తప్పే అయితే, క్షమాపణ కోరుకుంటున్నాను మావయ్యా! మా వివాహం అనుకోనివిధంగా పరిస్థితుల ప్రభావం ఫలితంగా జరిగిపోయింది" అంటూ క్లుప్తంగా జరిగిన విషయాన్ని చెప్పింది.

శంకరనారాయణ, బరువుగా ఓ నిశ్వాసం వదిలాడు.

"దైవసంకల్పాన్ని యెవ్వరూ తుడిచిపెట్టలేరమ్మా అరుణా! నువ్వో యింటిదానివయ్యావు... మేం యెంతో సంతోషిస్తున్నామమ్మా!" అంటూ రాఘవరావు కేసి చూసి "ఏంబాబూ, యేం ఉద్యోగం చేస్తున్నావు? ఎంతవరకూ చదువుకున్నావు?" ప్రశ్నించాడాయన.

రాఘవరావు చెప్పడాని కుద్యుక్తుడౌతున్నంతలో అరుణ అందుకుంది.

"టిక్కెట్టు కలెక్టరుగా పనిచేస్తున్నారు మావయ్యా! స్వంత ఇల్లుంది. ఇహపోతే, చదువంటారా? మెట్రిక్ వరకూ చదివారు. అయినా, చదువులో యేముందిలే మావయ్యా? జీవితం సుఖంగా సాగిపోతే చాలు" అంది మెల్లగా మొహం దించుకునే. ఆమెకి మావయ్యతో తను చెప్పిన రోజు గుర్తుకొచ్చింది.

శంకరనారాయణ తృప్తిగా నవ్వేడు. తన మాట మొదట్లో కాదన్నందుకు, యిప్పుడామె మనసు మార్చుకున్నందుకు, అతనిలో యేమాత్రం కోపం రాలేదు.

"నిజమేనమ్మా! చదువులో యేముంది. ఇప్పటికయినా నీలోని వివేకం మేల్కొన్నది... అందుకు సంతోషం. అలా నిల్చుండిపోయావు... కూర్చో బాబూ!" అంటూ రాఘవరావుని ఆప్యాయంగా చెయ్యిపట్టుకుని కూర్చోబెట్టాడు కుర్చీలో.

అరుణ ముసిముసి నవ్వుల్తో, పిల్లల చేతిలో బిస్కెట్ల పేకెట్లు పెడుతూ, అత్తయ్య వెంట లోపలికి నడిచింది.

రాఘవరావు శంకరనారాయణ చల్లని మనస్సుని లోలోన అభినందించుకున్నాడు.

శంకరనారాయణ ఆ రోజు అనుభవించిన ఆనందం వర్ణనాతీతం; ఆ రోజు ఆ యింట్లో ఒక పండుగ.